www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 5 జనవరి 2024
5
తూర్పుగోదావరి

అంతర్జాతీయ తెలుగు మహాసభకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - రాజానగరం

చైతన్య విద్యా సంస్థలు, ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్తంగా గైట్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీ రాజరాజ నరేంద్రుల పట్టాభిషేక సహస్రబ్ది ఉత్సవాలు నీరాజనంగా నన్నయ భట్టారకుని మహాభారతం వెయ్యేళ్లపూర్తి చేసుకున్న సందర్భంగా అంతర్జాతీయ తెలుగు మహాసభను నిర్వహిస్తున్నామని చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు కెవివి.సత్యనారాయణరాజు, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సభలు గురువారం ప్రారంభమై మూడు రోజులపాటు జరుగుతాయని చెప్పారు. ఇందుకోసం రాజరాజ నరేంద్రుని వేదికతోపాటు గైట్ డిగ్రీ కళాశాల, గైట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో శ్రీ నారాయణ భట్టు వేదిక, శ్రీ ఆది కవి అన్నయ్య వేదికలను ఏర్పాటు చేశారు.

పండక్కైనా వేతనాలు ఇస్తారా?

ఆశగా ఎదురు చూస్తున్న 108 ఉద్యోగులు

ఉమ్మడి జిల్లాలో రూ. కోటి పైనే బకాయిలు

పని ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులతో సతమతం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సంక్రాంతి పండుగకైనా వేతనాలు ఇస్తారా..? అని 108 ఉద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు. నవంబరు, డిసెంబరు నెల వేతనాలు విడుదల చేస్తే తమ ఆర్థిక అవసరాలు కొంతైనా తీరుతాయని వారంతా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు పెరుగుతున్న పని ఒత్తిడి, మరోవైపు ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గట్టిగా నిలదీస్తే పైస్థాయిలో వేధింపులు తప్పడం లేదు.. ఇలా మానసిక, ఆర్థిక సమస్యలతో తీరకలేని విధులతో 108 అంబులెన్స్ సిబ్బంది సతమతమవుతున్నారు. సెలవులు కూడా ఇవ్వకపోవడంతో ఆరోగ్యపరమైన సమస్యను ఎదుర్కొంటున్నారు.

బకాయిలు రూ. కోటి పైనే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో 160 వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాల్లో దాదాపుగా 300 మంది వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు. మూడు కేటగిరీలుగా వీరికి వేతనాలు అమలు చేస్తున్నారు. తొలి కేటగిరీకి రూ.18 వేల నుంచి రూ.20 వేలు, రెండో కేటగిరీకి రూ.23 వేల నుంచి రూ.25 వేలు, మూడో కేటగిరీకి రూ.28 వేల నుంచి రూ.30 వేల చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు. గతేడాది అక్టోబరు, నవంబరు, డిసెంబరు మూడు నెలల పాటు వారికి వేతనాలు ఇవ్వలేదు. 108 ఉద్యోగులు ఆందోళనతో ఎట్టకేలకు ఇటీవల ఒక్క నెల వేతనాలు మాత్రమే విడుదల చేశారు. ఇప్పటికీ రెండు నెలల వేతనాలు ఇవ్వలేదు.

ఒక్కొక్క వాహనానికి 5 మంది చొప్పున కనీసంగా 340 మంది సిబ్బంది పని చేయాల్సి ఉంది. ఒక మండలంలో వాహనం అందుబాటులోకి లేకుంటే మరో మండల వాహనాన్ని పంపుతున్నారు. ప్రతి వాహనానికి నలుగురు సిబ్బంది ఉన్నారు. ఇద్దరు పైలట్‌లు, మరో ఇద్దరు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్‌లు సేవలందిస్తున్నారు. పగటి వేళల్లో ఇద్దరు, రాత్రి వేళల్లో ఇద్దరు వంతున విధులు నిర్వహిస్తున్నారు. రెండు వాహనాలకు వచ్చేసరికి పది మంది సిబ్బంది ఉండాలి. అంటే నాలుగు రోజులకు ఒకసారి ఆఫ్ ఇచ్చిన పుడు అదనంగా ఉండే ఇద్దరు సిబ్బంది విధుల్లో ఉంటారు. పూర్తి స్థాయిలో సిబ్బంది లేకపోవటంతో పని ఒత్తిడి పెరుగుతోంది.

ఓవైపు పని ఒత్తిడి మరో వైపు ఆర్థిక సమస్యలు

ప్రస్తుతం రెండు వాహనాలకు 8 మంది సిబ్బందితోనే కాలం వెళ్లబుచ్చుతున్నారు. దానివల్ల ఆఫ్‌లు లేకుండా పోతున్నాయి. సెలవులు ఇవ్వడం లేదు. సిబ్బంది నిత్యం విధుల్లో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. తీరిక లేకుండా సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది..ప్రతి మండలంలోనూ 108 వాహనాలు అందు బాటులో ఉండాలి. అత్యవసర సమయాల్లో సేవ లందించాలి. ఇప్పుడా పరిస్థితి లేదు. రాజమహేంద్రవరం అమలాపురం వంటి జిల్లా కేంద్రాల నుంచి ప్రతిరోజు 5 లేక 6 వాహనాలు కాకినాడకు రిఫర్ చేస్తున్నారు. ఏరియా ఆస్పత్రి నుంచి రిఫర్ చేసే కేసులకు ఆసుపత్రి సొంత వాహనాలు వినియోగించుకోవాలి. సొంత వాహనాలు లేకపోవడంతో 108లో కాకినాడ పంపుతున్నారు. జిల్లాలోని అన్ని పట్టణాల్లోని ఆస్పత్రులు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. ప్రతిరోజూ ఒక్కో ఆస్పత్రి నుంచి కనిష్ఠంగా నాలుగు కేసులను కాకినాడకు రిఫర్ చేస్తున్నారు. ఇలా 108 వాహనాలు ఇప్పుడు రిఫర్ కేసులను తరలించడానికే ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి. ఫలితంగా అత్యవసర సమయాల్లో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో 108 సిబ్బందిని అత్యవసర విభాగాల సిబ్బందిగా గుర్తించేవారు. క్రమం తప్ప కుండా వేతనాలు మంజూరు చేసేవారు. ప్రతినెలా సిబ్బందికి వేతనం సక్రమంగా ఇవ్వడం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వకపోవడంతో సిబ్బంది నిర్వహకులను ఒత్తిడి చేయలేని పరిస్థితి నెలకొంది.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

జిల్లాలో 108 సిబ్బందికి ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు విడుదల చేయాలి. కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తిస్తామంటూ గతంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలి. వాహనాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు నిర్వహించాలి. వాహనాలు కండిషన్‌లో ఉండేలా చర్యలు చేపట్టాలి. కార్మిక చట్టాలకు అనుగుణంగా 8 గంటల పని విధానం అమలు చేయాలి

- ఎన్.బలరాం, జిల్లా గౌరవాధ్యక్షులు, 108 ఎంప్లాయిస్ యూనియన్

సమ్మె శిబిరంలో ఎస్ఎస్ఎ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు

తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం చైర్మన్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులను తీసివేస్తామంటూ ప్రభుత్వం చేసే తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని జెఎసి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం చైర్మన్ ఎవి.నాగేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రవరంలోని డిఇఒ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(జెఎసి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధి సమ్మె 16వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు నాగేశ్వరరావు హాజరై మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రస్తుతమున్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని, కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చి, వేతనాలు పెంచి ప్రతి నెలా ఒకటో తేదీన విడుదల చేయాలని ఆయన కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరుతున్న న్యాయ పరమైన డిమాండ్లు సాధించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు ఎమ్.రఘునాథ్, డి.వంశీకృష్ణంరాజు, పి.దుర్గాప్రసాద్, ఆర్.వెంకట్రాజు, మిరపరాజు, వెంకట్ మాట్లాడారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమానిన ఉధృతం చేస్తామన్నారు. సమగ్రశిక్ష ఎఫ్ఎఒ స్నేహలత అంధుల దినోత్సవం సందర్భంగా లూయీస్ బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఉపాధ్యక్షులు అరుణ్, సమగ్రశిక్ష ఉద్యోగులు వెంకట్, గణేష్, రాజేష్‌కుమార్, సంధ్యారాణి, దేవి, మహేశ్వరి, ఉష, లత, సీతామహాలక్ష్మి, రమేష్, చంద్ర రావు, మస్తాన్ వల్లి, రాజేశ్వరి, గీతభవాని, శిరీష పాల్గొన్నారు.

బ్యారేజ్ రహదారి పనులను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

బ్యారేజ్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత స్పష్టం చేశారు. గురువారం ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్‌పై జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడారు. జిల్లాలో అత్యంత ప్రాధాన్యత కలిగిన రహదారి మార్గాల్లో ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ ఒకటన్నారు. ఇటీవల మరమ్మతుల కోసం ప్రభుత్వం కేటాయించిన రూ.2 కోట్ల నిధులతో పనులు చేపట్టామన్నారు. ఈ పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసేలా పర్యవేక్షణ చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బ్యారేజ్ రహదారి పనులను ఇరువైపులా సమాంతరంగా చేపట్టి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. జనవరి నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలన్నారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఇఇ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, డిఇ రమేష్, ఎఇఇ సిహెచ్.సుధాకర్, ఎఇ సునీల్, కాంట్రాక్టర్ ఉన్నారు.

పనుల ప్రగతిని తెలుసుకుంటున్న కలెక్టర్ మాధవీలత

పేదల అభివృద్ధికి జగన్ కృషి : ఎంఎల్ఎ తలారి

ప్రజాశక్తి - గోపాలపురం

దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక ఎంఎంసి ఆవరణలో ప్రభుత్వం పెంచిన పింఛన్లను గురువారం లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ప్రతి క్షణం పరితపించే వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపిడిఒ బిఎస్ఎస్.శ్రీనివాస్, సర్పంచులు పైడి శిరీష, కె.ధనలక్ష్మి, పఠాన్ అన్సర్ భాషా, నాయకులు ముల్లంగి శ్యామసుందర్‌రెడ్డి, దుగ్గిరాల రమేష్‌బాబు, శ్రీనివాసరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల ర్యాలీ, మానవహారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా గురువారం ర్యాలీ, అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘాల జెఎసి నాయకులు, ఎఐటియుసి రాష్ట్ర కన్వీనర్ కోరుమామిళ్ల సుబ్బారాయుడు మాట్లాడారు. సమ్మెను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కార్మికులను మరింత రెచ్చగొడుతుందన్నారు. రాష్ట్రంలో 45 వేల మంది మున్సిపల్ కార్మికులు శాంతియుతంగా సమ్మె చేస్తున్నారన్నారు. సమ్మెలో పాల్గొన్న కార్మికులకు షోకాజ్ నోటీసులిస్తూ భయపెట్టాలని చూస్తుందన్నారు. పోటీ కార్మికులను దింపి గొడవలు పెడుతుందన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేవరకూ సమ్మెను విరమించేది లేదన్నారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు తాటిపాక మధు, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ కుంద్రపు రాంబాబు మాట్లాడారు. కార్మికులకు వేతన బకాయిలు ఇవ్వాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి రమణ, ముత్యాలు మురళీకృష్ణ, బంగారు నాగేశ్వరరావు, ధనుల దుర్గమ్మ, ముత్యాల నందకిషోర్, బంగారు గిరి, కాకి శారద పాల్గొన్నారు.

24వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

9న మద్దతుగా కార్మిక సంఘాల ప్రదర్శన

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

హామీల అమలు కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఈ సమ్మె గురువారం నాటికి 24వ రోజకు చేరింది. సమ్మెలో భాగంగా శిబిరాల వద్ద ధర్నాలు నిర్వహించారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు సందర్శించి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం హయాంలో ప్రజలపై ఏడాదికి రూ.లక్షకు పైగా అదనపు భారం పడిందన్నారు. కనీస అవసరాలు తీర్చుకోవాలంటే అంగన్‌వాడీలకు వేతనాలు పెంపు తప్ప మరో మార్గం లేద్నారు. వైసిపి అధికారంలోకొచ్చిన తర్వాత గతంతో పోలిస్తే కనీసంగా ఒక కుటుంబానికి నెలకు రూ.10 వేల నుంచి రూ.15వేల వరకూ అదనపు భారం పడిందన్నారు. ఈ భారాలన్నీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే దోచుకుంటున్నాయన్నారు. జగన్ ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కన్నా అదనంగా వేతనం పెంచాలని అంగన్‌వాడీలు కోరుతున్నారన్నారు. వారికి గొంతెమ్మ కోర్కెలు అనడం సబబు కాదన్నారు. 24 రోజులుగా అంగన్‌వాడీల శాంతాన్ని చూశారని, ఇది వారి చేతకాని తనంగా చూడరాదన్నారు. 3న కలెక్టరేట్ల వద్ద జరిగిన ధర్నాలకు 90 వేలకు పైగా అంగన్‌వాడీలు పాల్గొన్నారని తెలిపారు. దీన్ని చూసి అయినా ప్రభుత్వం స్పందించాలన్నారు. అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రజలు అండగా ఉన్నారన్నారు. ఈనెల 9న అన్ని జిల్లా కేంద్రాల్లో అంగన్‌వాడీలకు మద్దతుగా కార్మిక సంఘాలన్నీ కలిసి పెద్ద ఎత్తున ర్యాలీలు చేపట్టనున్నామని తెలిపారు. ప్రభుత్వ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం చేయడం తప్ప మరో మార్గం లేదన్నారు. అంగన్‌వాడీలను బెదిరించడం మానుకోవాలన్నారు. 3 లక్షల ఉద్యోగులు తొలగించి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత ఏమి సాధించిందో తెలుసుకోవాలన్నారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులోవ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ తదితరులు మాట్లాడారు. ఎపి అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాజమండ్రి ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు కె.శారద, కె.సునీత, కోశాధికారి రామలక్ష్మి, సెక్టర్ లీడర్లు మరియమ్మ, శాంతరత్నం, మున్ని తదితరులు పాల్గొన్నారు. **కడియంలో** నిర్వహించిన సమ్మెను ఉద్దేశించి నాయకులు కె.బేబిరాణి మాట్లాడారు. 99 శాతం హామీలను నెరవేర్చామని చెప్పుకుంటున్న ప్రభుత్వం అంగన్‌వాడీల హామీలను ఎందుకు నెరవేర్చట్లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాజానగరం ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి వై.సుజాత అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **తాళ్లపూడిలో** మండల కార్యాలయాల సముదాయం వద్ద అంగన్‌వాడీలు నిరసన దీక్ష చేపట్టారు. వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **చాగల్లు** తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో పి.విజయకుమారి, కె.లక్ష్మి, కె.దమయంతి, ఎ.శ్రీదేవి పాల్గొన్నారు. **దేవరపల్లి** తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మెకు ప్రగతిశీల కార్మిక సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కె.మస్తాన్ హాజరై మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు భగత్‌రత్నాజీ, టిపి.లక్ష్మి, కె.కుమారి, గంగాభవాని పాల్గొన్నారు. **గోకవరం** లోఅంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మెను విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. **నల్లజర్లలో** మండల కార్యాలయాల ప్రాంగణంలో నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.భగత్ హాజరై మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కొక్కిరిపాటి వెంకట్రావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కె.విమల, ఎస్.శివకుమారి, పి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. **పెరవలి** తహశీల్దార్ కార్యాలయం వద్ద శిబిరాన్ని కొనసాగించారు. రేషన్ డీలర్ల అసోసియేష్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి కె.కృష్ణవేణి, సెక్టార్ లీడర్లు బి.నాగవేణి, సిహెచ్.విశాలి, వి.నిర్మల తదతరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు

చాగల్లులో...

కడియంలో...

పెరవలిలో మద్దతు తెలుపుతున్న రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు

కార్టూ'నిజం'

కోడి పందేలపై నిషేదం : కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

సంక్రాంతి పండుగ సందర్భంగా జూదాలు, కోడిపందేలపై నిషేదం ఉందని ఎక్కడైనా బరులు ఏర్పాటు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తారనికలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత స్పష్టం చేశారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో కోడిపందేల నిషేధంపై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారులతో కలసి కోడిపందాలు నిషేధంపై రూపొందించిన గోడ ప్రతులను, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏ ప్రాంతంలోనైనా కోడి పందాలు నిర్వహించడానికి అనుమతి లేదని ఈ విషయంలో ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలన్నారు. పోలీసులు, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ, సంబంధిత సమన్వయ శాఖ అధికారులు కోడిపందేల నిర్వాహకులపై దృష్టి సారించాలన్నారు. అటు వంటివి నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పొలాల్లో బరులు వేసే యజమానులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా కోడిపందేలు, జూదాలు అనధికార మద్యం విక్రయాలపై జిల్లా, డివిజన్, మండలాల్లోని సమన్వయ కమిటీలు విస్తృతస్థాయి తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా జిల్లాలో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్‌జిటి.సత్యగోవింద్, డిపిఒ జెవి.సత్యనారాయణ, డిహెచ్ఒ జి.పరశురామ్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎస్.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు

కొవ్వూరు రూరల్ : సంక్రాంతి పండుగ సందర్భంగా జూదాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవ హెచ్చరించారు. గురువారం ఆర్‌డిఒ కార్యాలయంలో కోడి పందేల నిషేధంపై పోలీస్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డివిజన్‌లోని ఏ ప్రాంతంలోనైనా కోడి పందేలు నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. దీనిపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలన్నారు. పోలీసులు, రెవెన్యూ, సంబంధిత సమన్వ య శాఖ అధికారులు కోడిపందేల నిర్వాహకులపై దృష్టి సారించాలన్నారు. పొలాల్లో బరులు వేసే యజమానులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. జూదాలు, అనధికార మద్యం విక్రయాలపై జిల్లా, డివిజన్, మండలాల్లోని సమన్వయ కమిటీలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కొవ్వూరు డిఎస్‌పి విఎస్ఎన్.వర్మ, తహశీల్దార్లు పాల్గొన్నారు.

చాగల్లు : సంక్రాంతి పండుగ పేరుతో జూదాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి హెచ్చరించారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కోడిపందేలు, గుండాట, పేకాటలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పధార్థాలకు పానీయాలు దూరంగా ఉండాలన్నారు. మండలంలో ఎక్కడైనా కోడిపందేల బరులు ఏర్పాటు చేస్తే తక్షణమే వాటిని ధ్వంసం చేసి సంబంధిత భూ యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిహెచ్.రమేష్, ఎంపిడిఒ పాతూరి నిర్మల కుమారి పశు వైద్య శాఖ అధికారుల, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, విఆర్‌ఒలు, విఆర్ఎలు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

తాళ్లపూడి : సంక్రాంతి పేర జూదాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి, గ్రామ కమిటీలకు, నాయకులకు అవగాహన కల్పించారు. కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ఉండేలా ఆయా గ్రామాల్లో అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఇటువంటి వాటికి ఎవరైనా పూనుకుంటే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాధిక, ఎంపిడిఒ రమణ, ఎఎస్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

అజ్జరపు లక్ష్మీసుందరరావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటు ప్రారంభ సభలో ఎంపీ మార్గాని భరత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

క్రీడలతోనే మానసిక ఒత్తిడిని జయించగలమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. క్వారీ మార్కెట్ - లాలాచెరువు రోడ్డులోని ఎస్‌బి వెంచర్స్ గ్రౌండ్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా అజ్జరపు లక్ష్మిసుందర్రావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఎంపీ భరత్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ళుగా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి సంక్రాంతి సందర్భంగా క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్న అజ్జరపు వాసు అభినందనీయులన్నారు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఇటువంటి క్రీడా పోటీలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. క్రికెట్‌తో పాటు వాలీబాల్, కబడ్డీ, మహిళలు, పిల్లల కోసం ముగ్గుల పోటీలను నిర్వహించడం హర్షణీయమన్నారు. వైసిపి నాయకులు డాక్టర్ గూడూరు శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లిదండ్రులను మరచిపోయి వృద్ధాశ్రమాలకు తరలిస్తున్న నేటి సమాజంలో తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 18 ఏళ్లుగా సంక్రాంతి సంబరాలు పేరుతో వివిధ రకాల క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. టోర్నీ నిర్వాహకులు అజ్జరపు వాసు మాట్లాడుతూ నగరంలోని క్వారీ ఏరియా పరిధిలోని 43వ వార్డు నుంచి 50 వార్డుల వరకు అలాగే 1 2 వార్డుల పరిధిలో యువతను ప్రోత్సహించే లక్ష్యంతో సంక్రాంతి సంబరాల పేరుతో క్రికెట్ టోర్నమెంట్ తో పాటు వాలీబాల్, కబడ్డీ పోటీలను తన తల్లిదండ్రుల పేరిట 18 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు మొత్తం పది వార్డుల నుంచి 32 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయని తెలిపారు 13న 48వ డివిజన్లో మహిళలను ప్రోత్సహించే లక్ష్యంతో ముగ్గులు పోటీలను నిర్వహిస్తామని తెలిపారు అదేరోజు సాయంత్రం 48వ డివిజన్లోని పనశెట్టి సెంటర్లో బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. విజేతలకు నగదు ప్రోత్సాహంతో పాటు ట్రోఫీలను, ఇతర బహుమతులను అతిథుల చేతుల మీదుగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మానే దొరబాబు, కంచుమర్తి చంటి, గుత్తుల మురళీధర్, ఆర్‌పిఎల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుంచె శేఖర్, వంకాయల సత్యనారాయణ, గుడాల ప్రసాద్, చెక్కా నవీన్, అజ్జరపు రమేష్, విజ్జన మధు, బంటి, రేలంగి హరీష్ , సుందర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

టోర్నీ సందర్భంగా క్రికెట్ ఆడుతున్న ఎంపీ మార్గానిభరత్ రామ్

నేరాలు ఘోరాలు

మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం రేవు సెంటర్లో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని పోలీసులు గురువారం అదుపులోనికి తీసుకున్నారు. అతని వద్ద రూ.5,590 విలువ చేసే 39 మద్యం సీసాలు . స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపినారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురంలో గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గోపాలపురం మండలం దొండపూడికి చెందిన మురముళ్ల చినబాబూరావు, కె.రామచంద్రరావులు గోపాలపురం ఎఎంసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పింఛన్ల పెంపు కార్యాక్రమానికి బయలు దేరారు. వారు రోడ్డు దాటుతున్న సమయంలో దేవరపల్లి నుంచి కొయ్యలగూడెం వెళ్తున్న టాటాఏస్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని గోపాలపురం సిహెచ్‌సికి తరలించారు. క్షతగాత్రులను ఎంఎల్ఎ తలారి వెంకట్రావు పరామర్శించారు. మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించాలని వైద్యులకు సూచించారు. రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

20 ఎకరాల చెరుకు తోట దగ్ధం

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం మండలం తొక్కిరెడ్డిగూడెంలో సుమారు 20 ఎకరాలు చెరుకుతోట దగ్ధమైంది. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక అధికారి బి.జహంగీర్ తెలిపిన వివరాల ప్రకారం గోపాలపురం గ్రామానికి చెందిన బోళ్ల భాస్కరరావుకు చెందిన 20 ఎకరాల చెరుకుతోటలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తెగిపడటంతో నిప్పులు చెలరేగి మంటలు వ్యాపించాయి. గాలులు కూడా తీవ్రంగా ఉండటంతో 20 ఎకరాల్లో తోట పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.8 లక్షలు నష్టం వాటిల్లింది.

కొనసాగిన ఆసుపత్రి సిబ్బంది ఆందోళన

ప్రజాశక్తి - యానాం

జీతాల బకాయిలను చెల్లించాలని స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన ఆందోళన గురువారానికి రెండో రోజుకు చేరింది. ఆసుపత్రి ఎదుట చేపట్టిన ఆందోళనలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మల్లాడి సత్తిబాబు పాల్గొని సిబ్బందికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో గత 13 ఏళ్లుగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా 42 మంది పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి 46 నెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించకుండా ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. తక్షణమే పెండింగ్ బకాయిలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుక

ప్రజాశక్తి - యానాం

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు గురువారం స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జ్ కె.శ్రీనివాస్, సిబ్బంది విద్యార్థులతో కలిసి లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ఇన్‌ఛార్జ్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నతనంలోనే లూయిస్ బ్రెయిలీ కంటి చూపును కోల్పోయిన అంధుల విద్యను నేర్చుకునేందుకు లిపిని సృష్టించారని తెలిపారు.

నవోదయ ఎంట్రన్స్‌కు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - యానాం

జవహర్ నవోదయ విద్యాలయంలో చదువుకోవాలని ఎంట్రన్స్ కొరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులకు నవోదయ ఎంట్రన్స్ స్టడీ మెటీరియల్స్ ఉచితంగా పంపిణీ చేసినట్లు విద్యాలయ ప్రిన్సిపల్ టివిఎస్.ప్రకాశరావు తెలిపారు. ఈ మేరకు గురువారం వివిధ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు నవోదయ విద్యాలయ సిబ్బంది ఉచితంగా స్టడీ మెటీరియల్స్, మోడల్ పేపర్స్ అందజేశారు. ఈనెల 20వ తేదీన నవోదయ విద్యాలయ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష, ఒఎంఆర్ సీట్ పూర్తి చేసే విధానంపై అవగాహన కల్పించారు. పరీక్షల్లో విద్యార్థులు విజయం సాధించాలని ఆకాంక్షించారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి -దేవరపల్లి

టిడిపి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు అన్నారు. గురువారం రామన్నపాలెం, ధూమంతుని గూడెంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆండ్రు అనిల్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మద్దిపాటి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. టిడిపిని అధికారంలోకి తెచ్చేలా ప్రతి కార్యకర్తా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు, ఊనగట్ల సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం9 గంటల నుంచి 1 గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపేస్తామని చాగల్లు మండల విద్యుత్ శాఖ అధికారి ఎస్.త్రిమూర్తులు తెలిపారు. చాగల్లు టౌన్, మీనానగరం, నేలటూరు, అమ్మికుంట, ఊనగట్ల, వ్యవసాయ, ఊనగట్ల సబ్ స్టేషన్ పరిధిలో ఊనగట్ల, నందిగంపాడు, ఎస్.ముప్పవరం గ్రామాలకు, వ్యవసాయ భూములకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తెలుగు మహాసభకు మైత్రి బుద్ధ విహార్ స్వాగతం

ప్రజాశక్తి - కడియం

రాజమహేంద్రవరం సమీపంలోని కడియం మండలం వేమగిరి గ్రామంలో ఉన్న మైత్రేయి బుద్ధాశ్రమం ప్రపంచ తెలుగు మహాసభలకు విచ్చేస్తున్న వారికి స్వాగతం పలుకుతుందని ఆశ్రమం నిర్వాహకులు మహోదయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు జాతి సాంస్కృతిక వికాసానికి, తెలుగు భాష పరంపరాభివద్ధికి ఈ ఆశ్రమం అంకితం అయిందన్నారు. 84 అడుగుల నిలువెత్తు నడయాడే తథాగతుని మూర్తితో దేశంలోనే అరుదైన ఆశ్రమంగా ప్రఖ్యాతి చెందిందని చెప్పారు. తెలుగు భాషలోని అక్షరాల వర్ణమాలతో నిర్మించిన 'తెలుగు పందిరి', ఇంకా శతాబ్దాల క్రితమే తెలుగునాట ఆలోచనా చైతన్యాన్ని రగిలించిన, మొట్టమొదటి తెలుగు ప్రజాకవి 'వేమన' దాదాపు 12 అడుగుల ఎత్తయిన దేశంలోనే అతిపెద్ద విగ్రహం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని తెలిపారు. తెలుగువారి కీర్తిని వైజ్ఞానిక రంగంలో నలుదిశలా చాటిచెప్పిన ఎల్లాప్రగడ సుబ్బారావు మొదలుకొని ఎన్‌టి.రామారావు వరకూ, మహాకవి గురజాడ, కందుకూరి వీరేశలింగం నుంచి పుచ్చలపల్లి సుందరయ్య వరకూ ఎందరో మహానుభావులు ఇక్కడ తారసపడతారని వివరించారు. కనులవిందుచేసే శోభాయమాన ప్రకృతి దృశ్యాల మధ్య, విస్తరించిన పచ్చిక బయళ్లు, ప్రపంచ వ్యాప్తంగా అనేక భాషా పుస్తకాలతో తొణికిసలాడే విశాలమైన గ్రంథాలయం, ప్రశాంతమైన ధ్యాన మందిరం, వస్తూపోయే సందర్శకులతో కళకళలాడే మైత్రేయి బుద్ధ విహార్‌కి ప్రపంచ తెలుగు మహాసభలకు విచ్చేస్తున్న వారికి ఆహ్వానం పలుకుతుందన్నారు. అందరికీ అందుబాటులో వేమగిరిలో ఉన్న ఈ మైత్రేయి బుద్ధ విహారలో ముందుగా తెలియజేసిన వారికి ఉచితంగా భోజన, వసతి సదుపాయాలు కూడా ఉంటాయని, మరిన్ని వివరాలకు 9441265845 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఇవిఎంలపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

ఇవిఎంలు, వివి ప్యాడ్‌లపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఓటరు హెల్ప్ డెస్కులో ఎలక్ట్రానిక్ యూనిట్స్ ప్రదర్శనను జెసి తేజ్‌భరత్, డిఆర్‌ఒ నరసింహులుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఓటర్లకు, అధికారులకు, సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం ఇవిఎం, వివిప్యాడ్, కంట్రోల్ యూనిట్‌లను ప్రదర్శించామన్నారు. కలెక్టరేట్‌కు ప్రతిరోజూ సందర్శకులు వస్తుంటారని, వారితోపాటు సోమవారం స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రజలు ఓటింగ్ విధానంపై వీటి ద్వారా అవగాహన కల్పించాలని అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ జె.సత్యనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కెఎన్.జ్యోతి, కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ కృష్ణనాయక్, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా బ్రెయిలీ జయంతి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

అంధులకు జ్ఞాన కవాటాలను ప్రసాదించి బ్రెయిలీ లిపి ద్వారా వారి పాలిట మహనీయునిగా లూయీ బ్రెయిలీ నిలిచారని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో లూయీ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఎస్‌పి పి.జగదీష్, అంధ ఉద్యోగి పి.రామలక్ష్మితో కలిసి లూయీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 2024 ఏడాది బ్రెయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, అంధులకు ఆరాధ్యుడు బ్రెయిలీ అన్నారు. అంధుల కోసం ప్రత్యేక లిపిని రూపుదిద్ది వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, జిల్లా వికలాంగుల శాఖ పర్యవేక్షకులు బి.నాగభూషణం, దివ్యాంగుల సంక్షేమం, దృశ్య లోప ప్రతిభావంతులు సంఘం ప్రతినిధి ఎన్.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు వేతన సవరణ చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని జిల్లా వైద్య అరోగ్యశాఖ అధికారికి జిల్లాలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు వేతన సవరణ సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళన బాట తప్పదన్నారు. రాష్ట్ర అధికారులు వేతన సవరణ చేస్తామని ఉద్యోగుల ప్రతినిధులుతో చర్చలు జరిపారన్నారు. హామీలు ఇచ్చి అమలు మరిచారన్నారు. తమకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి జగన్‌ను కోరారు. వినతిపత్రం అందించిన వారిలో వడ్డి వెంకటలక్ష్మి, రాజశేఖర్, చంద్రశేఖర్, విజయ, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - పెరవలి

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ఎంఎల్ఎ జి.శ్రీనివాసనాయుడు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాట ప్రకారం జగన్ పింఛన్లను రూ.3వేలు చేశారన్నారు. మొత్తం 166 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.సీతారాంప్రసాద్, మండల అధ్యక్షులు వీరమల్లు సత్యనారాయణ, జడ్‌పిటిసి కొమ్మిశెట్టి రామాంజాని, వైస్ ఎంపిపి వేంద్ర శ్రీనివాస్, ఎస్‌సి సెల్ అధ్యక్షులు పొట్టి రాంబాబు, రాష్ట్ర కుమ్మరి శాలివాహన అధ్యక్షులు పసలపూడి బద్రయ్య సర్పంచ్ గంగోలు సీతమ్మ, ఎంపిడిఒ తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌ను కలిసిన గిరజాల

ప్రజాశక్తి-కడియం

అవ్వా, తాతలకు పింఛను రూ.3వేలు పెంచుతూ నిర్వహించిన కార్యక్రమం నిమిత్తం బుధవారం కాకాకినాడ విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌ను వైసిపి రాష్ట్ర కార్యదర్శి, బాధ్యత సేవా సంస్థ అధ్యక్షులు గిరాజాల బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాధ్యతా సేవా సంస్థ 15వ వార్షికోత్సవం మెమెంటోను అందించారు. సేవా సంస్థ తరపున చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు..

వికసిత భారత్‌పై అవగాహన

ప్రజాశక్తి - చాగల్లు

వికసింత భారత్ సంకల్పయాత్రపై చాగల్లు పంచాయతీ వద్ద సర్పంచ్‌ఉన్నమట్ల మనశ్శాంతి అధ్యక్షతన తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ పాతూరి నిర్మలకుమారి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వివిధ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

నిత్యావసర సరుకుల అందజేత

చాగల్లు : పదిహేను రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎంఇఒలు వి.ఖాదర్‌బాబు, సిహెచ్.సుబాకర్ ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం అందజేశారు. వీటితోపాటు ఒక్కో కేజీ వంటనూనె, కందిపప్పు, పంచదార వంటి సరుకులను తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి మెరుపో సూరిబాబు, రాష్ట్ర కార్యదర్శి బొల్లిపో మధుశేఖర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు, నాయకులు గణేష్, వెంకట్, రాజేష్, రాజ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

గోకవరంలో 'బాబు ష్యూరిటీ'

గోకవరం : గోకవరం టీచర్స్ కాలనీ, రంపయర్రం పాలెం, తంటికొండ, వెంకటనగరం, వీర్లంకపల్లి, వెదురుపాక, గుమ్మల దొడ్డి గ్రామాల్లో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడారు. టిడిపి, జనసేన పార్టీ ఉమ్మడిగా రూపొందించిన మేనిఫెస్టోను ఇంటింటా వివరించారు. హామీ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దేశంలో తీరప్రాంత అభివృద్ధే లక్ష్యం

కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి రూపాల

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి(

దేశంలో ఉన్న సాగర తీరప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పర్షత్తం రూపాల అన్నారు. గురువారం కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం అమీనాబాద్‌లోని రామన్నపాలెం వద్ద సాగర్ పరిక్రమ్‌లో భాగంగా నిర్మిస్తున్న హార్బర్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులతో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. సాగర్ పరిక్రమ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం దేశంలోని సాగర తీర ప్రాంతాలను అభివృద్ధి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఓడరేవుల నిర్మాణం, అభివృద్ధి, హార్బర్ల నిర్మాణాలను చేపట్టిందన్నారు. రెండు రోజులుగా కాకినాడ తీరంలో హార్బర్ పనులను పరిశీలించానని తెలిపారు. హార్బర్ నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. యు.కొత్తపల్లి మండలంలోని తీరప్రాంతలో సముద్రపు కోత ఎక్కువగా ఉందని కాకినాడ ఎంపీ వంగా గీత తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీనికి సంబంధించిన ఫైల్ ఇప్పటికే ప్రధాని మోడీ వద్ద పరిశీలనలో ఉందని తెలిపారు. ప్రాంతాలు వేరైనా సముద్ర తీర ప్రాంతాల్లో పరిస్థితులు, సమస్యలు ఒకేలా ఉంటాయని, రాబోయే రోజుల్లో వాటిని ఎలా ఎదుర్కోవాలో పూర్తిస్థాయిలో సన్నద్ధం అవుతామని మంత్రి తెలిపారు. కాకినాడ ఎంపీ వంగా గీతా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరప్రాంత అభివృద్ధికి నిరంతరం కషి చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డి మత్స్యకారుల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పల రాజు, పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రూపాల

ఆడపిల్లల్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి-కడియం

ఆడపిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనా, సమాజం పైనా, ప్రభుత్వంపైనా ఉందని ఎంఇఒ-2 నాగేశ్వరరావు అన్నారు. కడియం జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్‌ఎం సత్యనారాయణ అధ్యక్షతన మండల స్థాయి బాలిక సంరక్షణ దినోత్సవ పోటీలు గురువారం జరిగాయి. మండలంలోని ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు వ్యాసరచన, డ్రాయింగ్, వక్తత్వం పోటీల్లో పాల్గొన్నారు. వ్యాసరచనలో కడియం విద్యార్థులు జి.విజయలక్ష్మి ప్రథమ స్థానం సాధించగా, వీరవరం విద్యార్థి కె.యశ్వంత్ ద్వితీయం, జేగురుపాడు విద్యార్థిని పి.సువర్ణ తతీయ స్థానాలు సాధించారు. వక్తృత్వంలో వీరవరం విద్యార్థి సిహెచ్‌విడి.మణికంఠ ప్రథమ, కడియం విద్యార్థి టి.హేమ ద్వితీయ, జేగురుపాడు విద్యార్థి వరలక్ష్మి తృతీయ స్థానాలు సాధించారు. అలాగే డ్రాయింగ్ పోటీల్లో కడియానికి చెందిన ఓదూరి గౌతమినవ్యశ్రీజాత ప్రథమం, వీరవరం విద్యార్థి దిలీప్ సాయి ద్వితీయ, జేగురుపాడు విద్యార్థి కార్తికేయ తృతీయ స్థానాలు సాధించారని పోటీలు నిర్వాహకులు గొల్లపల్లి సత్యనారాయణ తెలిపారు. వీరు మండల స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.. ఈ కార్యక్రమంలో షేక్ ఇమామ్, ప్రసన్నకుమారి, సువర్ణవేణి, కె.రాజు పాల్గొన్నారు.

పొలాల్లో సర్వేపై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి - చాగల్లు

రాష్ట్ర ప్రభుత్వం పొలాల్లో సర్వే చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరిని అడిగి సర్వే చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ఆక్రమణలకు గురైన పుంత రోడుల్లు, పంటబోదెలను సర్వే చేయకుండా తమ పొలాల్లో సర్వే చేసి జగన్ బొమ్మలతో సర్వేరాళ్లు పాతడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. తమ పాస్‌బుక్‌ల్లో సైతం ప్రభుత్వ లోగో కాకుండా జగన్మోహన్ రెడ్డి ఫోటో ఎందుకు వేస్తున్నారంటున్నారు. ఇలాంటి పనుల వలన రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. మురుగు బోదెలు, పుంత రోడ్లను బాగుచేస్తే ఉపయోగకరమన్నారు.

వికలాంగులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచి వికలాంగులపట్ల ఆదరణ చూపాలని రాగోలపల్లి ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పాఠశాలలో గురువారం నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానిఇక పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గారావు బ్రెయిలీ జీవిత చరిత్రను, బ్రెయిలీ లిపిని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

షర్మిల చేరికపై హర్షం

ప్రజాశక్తి- పెరవలి, కొవ్వూరు

వైఎస్.షర్మిలరెడ్డి కాంగ్రెస్‌పార్టీలో చేరిన సందర్భంగా జిల్లా అధ్యక్షులు అరిగెల అరుణకుమారి హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అఖిల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, యువ నాయకుడు రాహుల్ గాంధీ సమక్షంలో వైఎస్.షర్మిలరెడ్డి పార్టీలో చేరారన్నారు. ఆమె చేరికతో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారని ఆమె తెలిపారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్: 2-1-81, ఫస్ట్‌ఫ్లోర్, హనుమాన్ కాంప్లెక్స్, కెఎన్ఎఫ్ మెయిన్‌రోడ్డు, ఖజానా జ్యూయలరీ ప్రక్కన, అమలాపురం.
- ఫస్ట్‌ఫ్లోర్, పద్మజ థియేటర్ రోడ్డు, మల్కిపురం
- ఫస్ట్‌ఫ్లోర్, ద్వారకా కాంప్లెక్స్, బస్టాప్ ఎదురు, విక్టరీ గార్డెన్ ప్రక్కన, రావులపాలెం

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-01-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1020.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
AMALAPURAM AREA CELL NO-80088 12798

5TH ADDITIONAL JUNIOR CIVIL JUDGE COURT, RAJAMAHENDRAVARARM
O.S.No.828/2021
Between :
Bank of Broda, kothapalli
Rep by Branch Manager,
(Previously Vijaya Bank)
... Plaintiff
And
Dasari Sathibabu
S/o.Subbarao, Gokavaram,
E.G.Dist. ...Defendant
NOTICE
The above Suit filed by the plaintiff Bank stands posted to dt.**11-01-2024** for appearance defendant. The above defendant have to appear before the above Court on dt.**11-01-2024 at 10-30 A.M.** and state his objections. Else the matter will be decided in his absence.
Mylavarapu Srimannarayna Murty
Advocate for Plaintiff
Kambalacheruvu,
Rajahmundry. Rajahmundry.
4-01-2024 Cell:9866279439

ప్రకటన
మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
H.M.O.P. No.172/2021
Between:
ఇళ్ళ విజయ కృష్ణంరాజు ...పిటీషనర్
మరియు
ఇళ్ళ సంధ్య, W/o. విజయ కృష్ణంరాజు D/o. పితాని వీర వెంకట సత్యనారాయణ, డోర్ నెం.6-58/1, గుబ్బల వారి పాలెం, అనాతవరం గ్రామం, ముమ్మిడివరం మండలం, డా॥బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్ ....రెస్పాండెంట్
పై నెంబరు పిటీషన్‌లో రెస్పాండెంట్ అయిన ఇళ్ళ సంధ్య గార్కి శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు ఇళ్ళ సంధ్య గార్కి ఈ పేపర్ నోటీసు ద్వారా వారి హాజరు నిమిత్తం ది.వి. **08-01-2024**న ఉదయం 10.30 నిమిషములకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటీషన్‌నందు మీ పరోక్షముగా తీర్మానించబడును.
వాయిదా తేది: 08-01-2024
అమలాపురం **దాకారపు ఎరకయ్య,** అడ్వకేట్
తేది:3-1-2024 అమలాపురం

పుదుచ్చేరి ప్రభుత్వము
జిల్లా పరిశ్రమల కేంద్రం, ప్రాంతీయ విభాగము, యానాం
File No. 05/DIC-Y/Schemes/2023-24/445 Date: 4 Jan, 2024

జిల్లా పరిశ్రమ కేంద్రం, యానాం వారు ఇన్ ప్లాంట్ ట్రైనింగ్ ద్వారా నిరుద్యోగులైన యువతీ యువకులకు స్థానికముగా యున్న ప్రభుత్వ కార్యాలయములలో ప్రతి సంవత్సరము శిక్షణ ఇచ్చుచున్నారు. 2023-24 సంవత్సరమునకుగాను ఇన్ ప్లాంట్ ట్రైనింగ్ ద్వారా శిక్షణ పొందగోరు యువతి యువకుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. శిక్షణ కాలము ఒక సంవత్సరము మరియు శిక్షణ ఇచ్చుటకు నిర్ణయించిన ట్రేడ్స్ వాటికి సంబంధించిన విద్యార్హతలు మరియు జీతముల వివరములు ఈక్రింద పట్టికలో చూపడమైనది.

Sl. No.	Trade	Minimum Qualification	Stipend (Rs. per Month)
1.	Computer Operation & Office Management	3 Years Diploma / Degree / PG with basic Computer knowledge	7500 / 9000
2.	Accounting Assistant (Govt. Dept. / Agencies	3 Years Diploma / Degree / PG in Commerce with basic Computer Knowledge	7500 / 9000
3.	Engineering Assistant (Govt. Dept. / Agencies / DIC / Industries Dept. / Govt. Press / TCP/ PPA/ Electricity Dept./ PWD / Agriculture Workshop / BSNL., ETC.,)	3 years Diploma / Degree / in Engineering	7500 / 9000
4.	Store Assistant (Govt. Dept. / Agencies)	UG/ PG in Arts/ Science / Commerce	7500 / 9000
5.	Chemical / Analytical Lab Analyst (Govt. Dept. / Agencies)	Degree / PG in Science with Chemistry as Subject	7500 / 9000
6.	Clinical Assistant (Govt. Hospitals)	+2 Pass with Science as a subject / SSLC with certificate in Paramedical	4500
7.	Data Entry Assistant (Govt. Dept. / Agencies)	+2 Pass / ITI with Computer Certificate	4500
8.	Front Office Assistant	SSLC / ITI	4500

అర్హత:
1. 25-01-2024 తేది నాటికి 18 సంవత్సరములు పూర్తయి 35 సంవత్సరముల లోపు వయస్సు కలిగి యుండవలెను.
2. కనీసం 3 సంవత్సరముల నుండి యానాం ప్రాంతంలో నివాసి అయి ఉండవలెను.
3. ఇంతకముందు ప్రభుత్వ పథకములు ద్వారా శిక్షణ పొందిన వారు అనర్హులు.
4. ఆదాయపు పరిమితి లేదు.

దరఖాస్తు ఫారములు మరియు ఇతర వివరముల కొరకు 05-01-2024 నుండి ఆఫీసు సమయములలో జిల్లా పరిశ్రమల కేంద్రం, యానాం వారిని సంప్రదించి ఉచితంగా పొందవచ్చును. అన్ని వివరములు పూర్తి చేసిన దరఖాస్తులు స్వీకరించుటకు ఆఖరు తేది. 25-01-2024.

సం/- మునిసామి
ప్రాంతీయ పరిపాలనాధికారి, యానాం